మామిడి రైతు కుదేలు

- ఈ ఏడాది కూడా కష్టమే...
- పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు.
- ప్రభుత్వం ఆదుకోవాలి
- ఈదురు గాలులకు నేలరాలిన కాయలు


అంతంత మాత్రంగానే మామిడి కాయలు

విజయపురం: ఈ ఏడాది కూడా మామిడి రైతు ఆశలు కుదేలయ్యాయి. లాభాలు మెండుగా వస్తాయని ఆశ పడితే, వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. ఆరంభంలో విరబూసిన పూతతో రైతుల్లో ఎన్నో ఆశలు రేగాయి. మూడేళ్లుగా వస్తున్న నష్టాలను ఈ ఏడాదైనా పూడ్చుకో వచ్చని ఆశపడ్డారు. పూత నిలబడేందుకు, పిందె బాగా వచ్చేందుకు పురుగుల మందు కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టారు. ఈసారి లాభాలు గ్యారంటీ అనుకున్న రైతులు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. రాను రాను ఆ ఆశలు తారుమారయ్యాయి. దట్టంగా అలముకున్న పొగమంచు, అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురుగాలులు నిండా ముంచేశాయి. పొగమంచుతో చాలా వరకు పూత మాడిపోయి నష్టం వాటిల్లింది. ఆ తర్వాత వచ్చిన పిందెను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. పిందె తొడిగాక కూడా పొగమంచు వీడకపోవడంతో తేనె మంచు పురుగు ఆశించి, కాయలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా కాపు ఉన్నా కాయ ఎదుగుదల లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. కాపు కోసం తోటలను లీజుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు.

నియోజకవర్గంలో..

నగరి నియోజకవర్గంలో 8,573 ఎకరాలలో మామిడి పంట సాగులో ఉంది. విజయపురం మండలంలో 3వేల ఎకరాలు, వడమాలపేట మండలంలో 3,626 ఎకరాలు, నగరిలో మండలంలో 893 ఎకరాలు, పుత్తూరు మండలంలో అత్యధికంగా 1,235 ఎకరాలు, నిండ్ర మండలంలో 680 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి.

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..

ఆరంభంలో విరబూసిన పూత ఆశలు రేపింది. ఆ తర్వాత వాతావరణం పూర్తిగా దెబ్బతీసింది. అకాల వర్షాలు మరింత దెబ్బతీశాయి. ఈ సారి కూడా రైతు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. పూత వచ్చేందుకు ఎరువులు, పురుగుల మందులు, దుక్కులు, చెట్లకు పాదులు కట్టడానికి చాలా పెట్టుబడి పెట్టారు. ఎకరాకు రూ.20 నుంచి రూ.35 వేలు వరకు ఖర్చు చేశారు. ప్రతి ఏటా అప్పులు పెరిగిపోతున్నాయి. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. ఈ ఏడాది కూడా మామిడి రైతులకు నష్టాలే వచ్చేలా ఉన్నాయి.



ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడి రైతును ప్రభుత్వమే ఆదుకోవాలి. మూడేళ్లుగా తీవ్ర నష్టాలే వస్తున్నాయి. ఎంత పెట్టుబడి పెట్టినా ఉపయోగం లేదు. ఇలాగైతే మామిడి తోటలను తీసేయడమే మేలు. ప్రతీ సంవత్సరం ఆశ పుడుతోంది. మామిడి రైతు నిలబడేలా ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు కల్పించాలి. లేకుంటే మామిడి రైతులు అప్పుల్లో కూరుకుపోయేలా ఉన్నారు.

–శరత్, మల్లారెడ్డికండ్రిగ, విజయపురం

ఈ ఏడాది కూడా నష్టమే..



మూడేళ్లుగా మామిడి పంటతో నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాదైనా గట్టెక్కుతామని ఆశపడ్డాం. పూత చూసి ధైర్యంతో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాం. కాపు పెద్దగా లేక పోగా అకాల వర్షాలు మరింత దెబ్బతీశాయి. నాకు రెండెకరాలు ఉన్నాయి. రూ.20 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. కావు సరిగ్గా లేదు. నష్టం వచ్చేలా ఉంది.

–ఉమాపతి, బట్టికండ్రిగ, వడమాలపేట

క్లుప్తంగా

గృహ నిర్మాణాలు వేగవంతం

నిండ్ర: మండలంలో గృహనిర్మాణ పనులను శుక్రవారం మండలంలోని అరూరు, ఇరుగువాయి గ్రామాల్లో ఎన్‌టీఆర్ గృహనిర్మాణాలను ఏఈ శ్రీధర్‌రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. పనులు పూర్తి చేసి బిల్లులు పొందాలని ఆయన అన్నారు. నూతన గృహనిర్మాణాలు కూడా అర్హులైన వారికి నమోదు చేస్తామన్నారు.

వధూవరులకు ఆశీస్సులు


వధూవరులతో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తదితరులు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎల్లాపల్లె సర్పంచ్ ఎలిజిబెత్, యేసు రత్నం దంపతుల కుమార్తె వివాహ వేడుకలకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులు వీణ, ప్రశాంత్ ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సెల్వి రాజా, వైఎస్సార్‌సీపీ నేతలు అంబోదరపల్లి బాబురెడ్డి, వెంకటేష్, అమ్ములు, వేల్కూరు కుట్టి, తూగుండ్రం సర్పంచ్ శ్రీ బాబు, చిట్టిబాబు, పుష్పరాజ్, కేశవులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నిండ్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్య సౌందర్య అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసుకోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యసేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారంతో పాటు మజ్జిగ, పండ్ల రసాలు, ఆకుకూరలు, అధికంగా నీరు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 49 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్లు సుశీల, మురళి పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయంపై శిక్షణ

గుడిపాల: రైతులకు వ్యవసాయంపై డిజిటల్ శిక్షణ ఇస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ తెలిపారు. రామభద్రాపురం, పానాటూరు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు వ్యవసాయంలో డిజిటల్ శిక్షణపై ఆమె అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, యూట్యూబ్ చానల్స్ నిర్వహణపై వారికి విపులంగా వివరించారు. 30 మంది రైతులకు స్మార్ట్‌ఫోన్, ఆధునిక డిజిటల్ ట్రైనింగ్‌ను మాస్టర్ ట్రైనర్లు యోగప్రియ, నదీమ్ రైతులకు వివరించారు.

చిత్తూరులో జాతర ఏర్పాట్ల తనిఖీ


చిత్తూరు బజారువీధిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగ జాతర నేపథ్యంలో కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ నరసింహప్రసాద్ శుక్రవారం బజారువీధి, గిరింపేట, సంతపేట, మురకంబట్టు, పొంచాలపురం, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, దొడ్డిపల్లెలోని గంగమ్మను ప్రతిష్ఠించే ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల సౌకర్యాలు, పారిశుధ్య పనులపై అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అమ్మవారి దర్శనం కల్పించడం, పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు ఉన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న

పెనుమూరు(కార్వేటినగరం): సాంకేతికతపై రైతులకు అవగాహన అవసరమని జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం పెనుమూరు మండలంలోని కలవకుంటలో రైతు లకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు డిజిటల్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకుంటే మార్కెట్ ధరలు, వాతావరణంలో మార్పులు తెలుసుకోవచ్చన్నారు. అలాగే యూట్యూబ్, వాట్సాప్ గ్రూపుల నిర్వహణపై కూడా అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ సంధ్యం, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జి కల్పన పాల్గొన్నారు.

కార్వేటినగరం ఎస్‌ఐ బదిలీ


రాజ్‌కుమార్

కార్వేటినగరం: ఎస్‌ఐ పి.రాజ్‌కుమార్‌ను తిరుపతి సీఐడీ కార్యాలయానికి బదిలీ చేస్తూ శుక్రవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

అధికార నందిపై ఆది దంపతులు


అధికార నందిపై విహరిస్తున్న శివపార్వతులు

పుత్తూరు: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శివపార్వతులు అధికార వాహనమైన నందీశ్వరుడిని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భిక్షాటన ఉత్సవాన్ని చేపట్టారు. ఉదయం 10 గంటలకు నటరాజ స్వామి అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి నందీశ్వరుడిపై ఆశీనులను చేశారు. మహిళల కోలాట నృత్యాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నయనానందభరితంగా సాగింది. ఈ సందర్భంగా ఇంటింటా కర్పూర హారతులను స్వీకరించిన శివపార్వతులు భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పి.రాజశేఖర్‌శెట్టి, వన్నెరెడ్డి సంక్షేమ సేవా సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

కిశోరి వికాసంతో బంగారు భవిత


వేమాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణ

వడమాలపేట (విజయపురం): కిశోరి వికాసం–2 కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని అంగన్‌వాడీ టీచర్ మునికన్నెమ్మ తెలిపారు. శుక్రవారం పూడి పంచాయతీ వేమాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ సంవత్సరం నుంచి 18వ సంవత్సరం వరకు బాలికలకు ఆరోగ్య సూత్రాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం బాల్యవివాహం చట్టరీత్యా నేరమని, వాటి వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయ, మహిళ పోలీసు జయసుధ, చంద్రమ్మ, వాసంతమ్మ, అహల్య, ఆశ వర్కర్ నవనీత తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి


బంగారుపాళెంలో వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ప్రజలు

బంగారుపాళెం: భారత హరిహద్దు పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో నివాళులర్పించారు. సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాండకు చెందిన ఆర్మీజవాన్ మురళీనాయక్ పాక్ కాల్పుల్లో వీరమరణం పొందారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, యువకులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని కార్గిల్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద అమరజవాన్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి వెలుగుతున్న క్యాండిల్స్‌తో నివాళులర్పించారు. జోహార్ వీరజవాన్ మురళీనాయక్, భారతమాతాకీ జే అంటు నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, దేశరక్షణలో అసువులుబాసిన మురళీనాయక్ పోరాటం ఆదర్శమని కొనియాడారు. యువత దేశరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. మురళీనాయక్ త్యాగాన్ని మురువలేనిదన్నారు. కార్యక్రమంలో పలురువు స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయపురం: మండల కేంద్రంలోని విజయపురం, ఇల్లత్తూరు 11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ సదాశివం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలను నివారిద్దాం


అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

నగరి: బాల్య వివాహాలు రూపుమాపుదాం అంటూ సీడీపీఓ కృష్ణవేణి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తెరణి సచివాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య విహహాలు చేయడంతో వచ్చే నష్టాలను తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండడానికి ఏయే పోషకాలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంఎస్‌కేలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

బంగారుపాళెం: ప్రజలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలని క్లస్టర్ ప్రోగ్రాం జిల్లా మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్(ఐసీటీసీ)ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఐసీటీసీలో రోజుకు ఎంతమంది హెచ్ఐవీ పరీక్షలు చేసుకునేందుకు వస్తున్నారని కౌన్సిలర్ బాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్‌ను సందర్శించి స్టాక్స్, కిట్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై చైతన్యం కల్పించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గర్భిణులకు తప్పనిసరిగా హెచ్ఐవీ పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీషా, ల్యాబ్ టెక్నీషియన్లు జయచంద్ర, భువన, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు దారుణం


అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టుల నిరసన

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు దారుణమని ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గంగాధరనెల్లూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షుడు మునికృష్ణ మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో అక్రమ తనిఖీలు, కేసులు, దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన తప్పులు, ఒప్పులను ప్రజలకు తెలియజేసే బాధ్యత జర్నలిస్టులకు ఉంటుందని తెలిపారు. వ్యతిరేకంగా వార్తలు రాస్తే విలేకర్లను అరెస్ట్ చేయడం సరికాదని మండిపడ్డారు. జర్నలిస్టులపై దాడులను ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి రాజేంద్ర, జర్నలిస్టులు ప్రేమ్‌చంద్, బాలాజీ పాల్గొన్నారు.

జానపద పాటల విజేత మునికృష్ణయ్య


జ్ఞాపిక అందుకొంటున్న మునికృష్ణయ్య

పుత్తూరు: జానపద జాతర పాటల పోటీల్లో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్‌ఓగా పనిచేస్తున్న చల్ల మునికృష్ణయ్య విజేతగా నిలిచారు. తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్లో శుక్రవారం ప్రజా కళావేదిక, ఎస్వీయూ సాంస్కృతిక విభాగం వారు సంయుక్తంగా నిర్వహించిన జానపద పోటీల్లో పాల్గొన్న మునికృష్ణయ్య విజేతగా నిలిచి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందుకొన్నారు. కార్యక్రమంలో ప్రజా కళావేదిక అధ్యక్షుడు ఎ.గోపాల్, యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యం


మాట్లాడుతున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం: బాల్యవివాహాల నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కింద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా తలెత్తే అనర్థాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీలను ఆదేశించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098, అలాగే 181, 100 నంబర్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు ఇందిరా, శామిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని క్షీరసముద్రంలో శుక్రవారం గ్రామస్తులకు బాల్య వివాహాల కారణంగా వాటిల్లే ఇబ్బందులపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లి చేస్తే బరువు తక్కువగా, జన్యులోపాలతో బిడ్డలు జన్మిస్తారన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి పాల్గొన్నారు.

కూల్.. కూల్ తాటి ముంజలు

- వేసవితాపం తీరుస్తూ ఆరోగ్యం ప్రసాదిస్తున్న ముంజలు
- సీజన్‌లో పలువురికి ఉపాధి


తాటి ముంజలు


సత్రవాడ వద్ద ముంజలు విక్రయిస్తున్న వ్యాపారి

నగరి: తాటి ముంజలు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చల్లదనమే కాదు ఆరోగ్యాన్ని కూడా పంచుతాయి. వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయస్సుల వారు ఇష్టంగా తింటారు. ఇవి వేసవిలోనే లభిస్తాయి. మార్కెట్‌లో ముంజలు కన్పిస్తే చాలు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. ఇందులో నీటిశాతం అధికం. కాస్త తీపిగా ఉంటాయి. చల్లదనాన్ని ఇస్తాయి.

అనేక ఉపయోగాల తాటిచెట్టు

30 మీటర్లు ఎత్తున ఎదిగే తాటి చెట్లు రెండు నుంచి మూడు మీటర్ల పొడవున ఆకులను కలిగివుంటాయి. ఈ చెట్లలోని ప్రతి భాగం ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది. విత్తనం నాటిన 15 ఏళ్ల తర్వాత చెట్టుకు కాయలు కాస్తాయి. ఈ చెట్లు నీటి అవసరం అంతగాలేని ప్రాంతాలు, బీడు భూముల్లో ఏపుగా పెరుగుతాయి. ఈ చెట్టులోని ప్రతి భాగం ప్రజలకు ఏదోవిధంగా ఉపయోగపడుతుంది. పాకలు వేసుకోవడానికి తాటి కలపను దూలాలుగా, వాసాలుగా, స్తంభాలుగా ఉపయోగిస్తారు. తాటినారతో తాళ్లను, ఆకులతో చాపలు, బుట్టలు, విసనకర్రలు, గొడుగులు, టోపీలు తయారు చేస్తారు. తాటి దుంగలను కాలువలపై వంతెనలుగా కూడా ఉపయోగిస్తారు. తాటి ఆకులను పందిరికి, పాకలకు ఉపయోగిస్తారు. తాటి బెల్లం వాడడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు తెలుపుతున్నారు.

సీజన్‌లో పలువురికి ఉపాధి

తాటి ముంజలు సీజన్‌లో పలువురికి ఉపాధినిస్తోంది. కొందరు జాతీయ రహదారుల పక్కన అక్కడక్కడా ఉంటూ ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు తాటి ముంజలు కొట్టి ఇస్తున్నారు. డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు తాటి ముంజలు విడిగా తీసి వాటిని ఐదేసి ఒక ప్యాకెట్లుగా కట్టి ప్యాకెట్టు రూ.25 చొప్పున పట్టణ పరిధిలో విక్రయిస్తున్నారు. వీరి వద్ద ముంజలు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

ఎండ వేడిమి ఎక్కువగా ఉంది

వేసవిలో తాటి ముంజలు అమ్మడం ద్వారా మంచి లాభాలు ఉంటాయి. అయితే ఎండ వేడిమి తట్టుకోవాలి. పలు ప్రాంతాల్లో తిరుగుతూ వ్యాపారం చెయ్యాల్సి ఉంటుంది. తాటి కాయలుగా తీసుకోవడం కంటే విడిగా ముంజలు కొనుగోలు చేయడానికే జనం ఆసక్తి చూపుతున్నారు. ఐదేసి ముంజలు వేసి ప్యాకెట్ రూ.25 చొప్పున అమ్ముతున్నాం.

–వేలాయుధం, కుమారమంగళం

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నిండ్ర: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన పంటలకు ఆశించే చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శుక్రవారం మండలంలోని అగరం, నిండ్ర గ్రామాల్లో వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మందులను పిచికారీ చేసుకోవాలని కోరారు. వరిలో లద్దె పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.